ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 8 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 22 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# ఢిల్లీ టూర్‌పై హరీష్ రావు క్లారిటీ

## కేసీఆర్ ప్రసంగాన్ని లైవ్‌లో 36 లక్షల మంది చూశారు..

## సీఎం స్పీచ్ 4లక్షల మంది కూడా చూడలేదు..

## నీ స్థాయి ఇప్పటికైనా తెలుసుకో.. రేవంత్‌పై హరీశ్‌రావు ధ్వజం



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**

తమ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు సీనియర్ న్యాయవాదులను కలిసేందుకే తాను, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ బహిరంగంగా శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఢిల్లీకి వెళ్లామని.. అందులో దాచిపెట్టేదేం లేదని మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మాత్రం తన మీడియా ద్వారా లీకులు ఇస్తూ డ్రామాలు ఆడారని.. విషయం లేని వాళ్లే ఇలాంటి చిల్లర పనులు చేస్తారని అన్నారు. కాళేశ్వరం కేసులో తీర్పు ఏ విధంగా వచ్చినా సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి ఉంటుందని.. అలాగే మే 6న హైకోర్టులో రాబోతున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసుల కోసం సీనియర్ లాయర్లను సంప్రదించడానికి ఢిల్లీ వెళ్లామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ బీ ఫామ్‌పై గెలిచి తాను ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని ఒక ఎమ్మెల్యే అనడం, దాన్ని స్పీకర్ ధ్రువీకరించడం అత్యంత దుర్మార్గమన్నారు. అలాగే.. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ ఉన్నదని.. పట్టపగలు బ్యాగులతో దొరికిపోయిన దొంగ రేవంత్‌రెడ్డి అని.. ఈరోజు హోంమంత్రిగా ఆయనే ఉండడంతో కంప్లైంట్ కూడా ఆయనేనని తెలిపారు. ప్రభుత్వం తరఫున నామమాత్రపు లాయర్లను పెట్టి, వ్యక్తిగతంగా తన తరఫున ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా లాంటి ఖరీదైన లాయర్లను పెట్టుకున్నారని ఆరోపించారు. ఓటుకు నోటు కేసులో బీఆర్ఎస్ పార్టీ తరఫున జగదీశ్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ ఇంప్లీడ్ అయ్యారని వెల్లడించారు. నాడు సమైక్యవాదులతో ..మిగతా 2లో



# చర్చలు విఫలం

### అర్ధరాత్రి నుంచి నిలిచిపోనున్న ఆర్టీసీ బస్సులు

### ఐఏఎస్ అధికారుల కమిటీతో జేఏసీ నేతల చర్చలు

### నాలుగు వారాల సమయం కోరిన ప్రభుత్వ కమిటీ

### తమ డిమాండ్లు పాతవేనని స్పష్టం చేసిన జేఏసీ

### నేటి అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించిన జేఏసీ

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ప్రభుత్వంతో టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నేతలు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీనితో ఈరోజు అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. ఐఏఎస్ అధికారుల కమిటీతో జేఏసీ నేతలు చర్చలు జరిపారు. ఈ క్రమంలో డిమాండ్లపై ప్రభుత్వానికి నాలుగు వారాల సమయం ఇవ్వాలని జేఏసీ నేతలను కమిటీ కోరింది. అప్పటి వరకు సమ్మెను విరమించుకోవాలని కోరింది. అయితే ఐఏఎస్ అధికారుల కమిటీ విజ్ఞప్తిని జేఏసీ నాయకులు అంగీకరించలేదు. తమ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. చర్చల అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ, తమ సమస్యలను ఐఏఎస్ అధికారుల కమిటీకి వివరించామని తెలిపారు. వారు నాలుగు వారాల గడువు కోరారని, కానీ తమ డిమాండ్లు కొత్తవి కావని వెల్లడించారు. గతంలో ఇచ్చిన హామీలనే తాము అడుగుతున్నామని అన్నారు. తమ మాట విని నాలుగు వారాలు ఆగాలని కమిటీ కరాఖండిగా 32 డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు తాము సమ్మెను కొనసాగిస్తామని వెల్లడించారు.

# ఎటిఎంలా కాళేశ్వరం ప్రాజెక్ట్

## రేవంత్ రాహువు... కేసీఆర్ కేతువు ... బండి విమర్శలు

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**



కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన స్కామ్ రూ.లక్ష కోట్లా? రూ.9వేల కోట్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిపై అయినా ప్రభుత్వం చర్యలు తీసుకుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్, రేవంత్ భాషను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కేంద్రానికి రేవంత్‌రెడ్డి రాసిన లేఖలో ఏముందని అడిగారు. రూ.9వేల కోట్ల అవినీతిపై దర్యాప్తు జరపాలని సీఎం రేవంత్ అంటున్నారని.. మరి లక్ష కోట్ల స్కామ్ గురించి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. రేవంత్ రాసిన లేఖలను కరపత్రాల రూపంలో ఇంటింటికీ ..మిగతా 2లో

# నార్వే బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ

## పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు ఆహ్వానం

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు ఈరోజు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ-నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, లక్రైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు.



### మోడీ నేతృత్వంలో దేశానికి

# సమర్థ నాయకత్వం

### తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఏకు ఓటేయండి

### పూర్వవైభవం రావాలంటే మార్పు రావాలి

### ఎన్‌డిఏ నేతలతో చంద్రబాబు మీడియా సమావేశం

**చెన్నై, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**

తమిళ ప్రజల భవిష్యత్తు కోసం తానే స్వయంగా చెన్నైకి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలోచిస్తారని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఓటు వేయాలని ఆయన కోరారు. తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను ..మిగతా 2లో



# 27న తెలంగాణ భవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశం

## భవిష్యత్ పోరాటాలకు శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న గులాబీ బాస్

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా... కేసీఆర్ మరో కీలక సమావేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల సందర్భంగా, పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా ఈ భేటీ జరగనుంది.పార్టీ సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కేసీఆర్ ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని రీ-ఆర్గనైజ్ చేసే దిశగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జెడ్పీ మాజీ చైర్మన్లను ఆహ్వానించారు.రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, భవిష్యత్ పోరాటాల కోసం శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యంగా రజతోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా ఒక భారీ యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించే అవకాశం ఉంది.



# కేరళలో బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

## ఆరుగురు మృతి.. 40 మందికి గాయాలు

2

# ఢిల్లీ టూర్‌పై హరీష్ రావు క్లారిటీ

మొదటి పేజీ తరువాయి...

చేతులు కలిపి తమ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కుట్ర చేసింది రేవంత్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. నాలుగున్నరేండ్ల నుంచి స్టేల మీద బతుకుతున్న రేవంత్‌రెడ్డికి ఆ స్టే వెకేట్ అయితే సీటు ఊడటం, జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు.కేసీఆర్ స్టేట్స్ మన్‌లాగా రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడితే.. రేవంత్‌రెడ్డి తన కుర్చీ కోసం స్ట్రీట్ మన్‌లాగా మాట్లాడారని హరీశ్‌రావు అన్నారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు.. కేసీఆర్ సభకు పోటీగా అదే సమయానికి మైకు పట్టుకుని రేవంత్ తన సంకుచిత బుద్ధిని బయటపెట్టుకున్నారన్నారు. కేసీఆర్ వస్తున్నారని భయపడి డైవర్షన్ కోసం ఒక కిస్తీ రైతు భరోసా వేశారని.. ఆయన గర్జించకపోతే ఆ డబ్బులు కూడా పడేవి కావన్నారు. కేసీఆర్ స్పీచ్ ఎప్పుడు స్టార్ట్ చేస్తారో చూసి అదే సమయానికి మైకు పట్టుకోవడం సీఎం స్థాయికి తగదన్నారు. కేసీఆర్ ప్రసంగాన్ని లైవ్‌లో 36 లక్షల మంది చూస్తే, రేవంత్ ప్రసంగాన్ని కేవలం 4 లక్షల మంది మాత్రమే చూశారన్నారు. కేసీఆర్ వ్యూవర్ షిప్‌లో కనీసం 10 శాతం కూడా రేవంత్‌కు రాలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అఫీషియల్ లైవ్‌లో బీఆర్ఎస్ సభను 2 వేల మంది చూస్తే, కాంగ్రెస్ లైవ్‌లో కేవలం 54 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. రెండున్నరేళ్లలో రేవంత్ స్థాయి ఎక్కడికి పడిపోయిందో, కేసీఆర్ మీద ప్రజల్లో ఉన్న అభిమానం ఏంటో ఈ లెక్కలే చెబుతున్నాయని అన్నారు. పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన సీఎంగా కేసీఆర్ ఎంతో హుందాగా రేవంత్‌రెడ్డి పేరు ఒక్కసారి కూడా తీయకుండా రాష్ట్ర ప్రయోజనాలపై మాట్లాడితే.. రేవంత్‌రెడ్డి మాత్రం రంకెలు వేయడం, ఏడవడం తప్ప ఇంకేం చేయలేదన్నారు. రేవంత్‌రెడ్డి తలకిందులుగా తపస్సు చేసినా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని హెచ్చరించారు. కేసీఆర్ చెప్పిన మాటలు విని తప్పులు సరిదిద్దుకుంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కనీసం డిపాజిట్లు అయినా దక్కుతాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని, లక్ష కోట్లు కొట్టుకుపోయాయని నిన్నటిదాకా దుష్ప్రచారం చేసిన వ్యక్తి.. ఇవాళ మేడిగడ్డ రిపేరు చేసుకుని వాడుకుంటామని ఒప్పుకున్నారని అన్నారు. రేవంత్ ఎన్ని డ్రామాలు ఆడినా సీఎంగా ఆయనకు నూకలు చెల్లాయని.. మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే పరిస్థితి లేదని అన్నారు. రైతు భరోసా డబ్బులు ఇంకెన్ని రోజులు వేస్తావని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు. పంట వేసేటప్పుడు ఇచ్చే రైతుబంధు.. పంటలు కోసే సమయానికి కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల కోడ్ అయిపోగానే రైతు భరోసా వేస్తా అన్నావ్ కదా.. ఏమైందని నిలదీశారు. మొన్న సిద్దిపేట వస్తే నిలదీస్తారని సగం రైతుబంధు వేశారని హరీశ్‌రావు తెలిపారు. ఇప్పుడు కేసీఆర్ వస్తుండని మరో సగం రైతుబంధు వేసిండని పే[illegible]న్నారు. కేసీఆర్ ప్రశ్నిస్తే.. బీఆర్ఎస్ పోరాడితే తప్ప రైతుబంధు వేయరా అని నిలదీశారు. మున్సిపల్ ఎన్నికల కోడ్ అయిపోగానే రైతుబంధు వేస్తామని చెప్పిండని గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు రూ.2వేల కోట్లు మాత్రమే వేసిండని తెలిపారు. ఇంకా 4వేల కోట్ల రైతుబంధు వేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఆరు నెలలైనా రైతుబంధు పూర్తిస్థాయిలో పడలేదని చెప్పారు. కేవలం మాటలు చెబుతూ రైతు భరోసా డ్రామా ఆడావని మండిపడ్డారు. మిగతా రైతు భరోసా ఎప్పుడిస్తావని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టులకు డబ్బులు ఉంటాయి కానీ రైతులకు ఉండవా అని నిలదీశారు.

# మోడీ నేతృత్వంలో దేశానికి సమర్థ నాయకత్వం

మొదటి పేజీ తరువాయి...

ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశంలో చెన్నై కీలక స్థానంలో ఉందని.. ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. నగర అభివృద్ధి గణనీయంగా మందగించిందని.. చెన్నై ఎయిర్‌పోర్టు పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందాయని.. ఐటీ, మౌలిక వసతులు, పెట్టుబడుల విషయంలో ముందున్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తమిళనాడులో సీఎం చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఎన్డీఏకి మద్దతు కోరుతూ చెన్నైలో చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడు ఎన్‌డిఏ నేతలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'తమిళనాడుకు గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉంది. ఒకప్పుడు చెన్నై ప్రధాన కేంద్రంగా సినీ పరిశ్రమ, ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉండేవి. నా వివాహం కూడా ఇక్కడే జరిగింది. ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీజే అబ్దుల్ కలాం, ఎంఎస్ స్వామినాథన్, అన్నాదురై వంటి మహానుభావులు తమిళనాడులో జన్మించారు. దేశానికి గొప్ప మేధావులను ఈ రాష్ట్రం అందించింది. కానీ, ప్రస్తుతం చెన్నైలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దెబ్బతింది. మహిళలపై నేరాలు సుమారు 59 శాతం మేర పెరిగాయి. కస్టోడియల్ డెత్ కేసులూ పెరిగాయి. నకిలీ మద్యం ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెన్నై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. 1995 నుంచి చాలా రోడ్లు అలానే ఉన్నాయి. వర్షాలు పడితే నగరంలో రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ?తమిళనాడుకు కేంద్రం నుంచి సమృద్ధిగా నిధులు వచ్చాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ఎంజీ రామచంద్రన్ పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వమే. ?హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతాయి. ప్రకాశవంతమైన భవిష్యత్, మంచి ఉద్యోగ అవకాశాలు కావాలంటే ప్రజలు ఈసారి జాగ్రత్తగా, తెలివిగా ఓటు వేయాలి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర సమన్వయం ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. కేవలం రాజకీయ కారణాలతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వెళ్లకూడదు. రాజకీయ లాభాల కోసం రాష్ట్రానికి నష్టం చేయడం సరైంది కాదు. అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీకి సహకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను కాంగ్రెస్, డీఎంకే పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు రావాల్సిన ప్రాతినిధ్యాన్ని అడ్డుకుని ద్రోహం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలకు లెక్కల ప్రకారం సీట్లు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవానికి సీట్లు పెరుగుతాయి. బిల్లులో స్పష్టంగా సీట్ల పెంపు గురించి పేర్కొన్నారు. తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లు ఉండగా.. 59కి పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ పార్లమెంట్ సీట్లు పెరుగుతాయి. డీలిమిటేషన్ పక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. సమతుల్యమైన ఫార్ములాతోనే సీట్ల పునర్విభజన జరుగుతుంది. కానీ ప్రస్తుత జనగణన ఆధారంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాలు వెనుకపడే ప్రమాదం ఉంది. ఆర్థిక సంస్కరణల వల్లే దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. పర్ క్యాపిటా ఆదాయం గణనీయంగా పెరిగింది. నేను కూడా ద్రవిడ వ్యక్తినే. దక్షిణాది అభివృద్ధి పట్ల నాకు ప్రత్యేక దృష్టి ఉంది. ??ముందుచూపు ఉన్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే విజనరీ లీడర్ మోదీ. ఈసారి ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు తెలుపుదాం' అని చెప్పుకొచ్చారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రం ఉదారంగా నిధులు ఇస్తున్నప్పుడు వినియోగించుకోవాలి కదా. సంక్షేమ కార్యక్రమాల కోసం చెన్నైకి కేంద్రం రూ.14 లక్షల కోట్లు ఇచ్చింది. కేంద్ర నిధులను దారి మళ్లించడం సమంజసమా అని చంద్రబాబు ప్రశ్నించారు.

## ఎటిఎంలా కాళేశ్వరం ప్రాజెక్ట్

మొదటి పేజీ తరువాయి...

పంచుతామన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళలు ఉన్నతస్థాయికి వెళ్లాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీకి పదవులు ఇస్తే మొత్తం మహిళలకు పదవులు వచ్చినట్లు భావిస్తున్నారన్నారు. విపక్షాల కుటుంబాల్లోని మహిళలకు పదవులు వస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగితే.. సీఎం రేవంత్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్లేస్‌లో కూర్చోవాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు వీగిపోవడానికి స్టాలిన్, రేవంత్ రెడ్డినే కారణమని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ కలవవని.. కలిసి పోటీ చేయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

## కాళేశ్వరం నిధులతో కుమార్తె పెళ్లి

### ఐఏఎస్ రజత్ కుమార్‌పై అవినీతి ఆరోపణలు

### 3 నెలల్లో తేల్చాలని కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)

తెలంగాణ నీటిపారుదల శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐఏఎస్ అధికారి రజత్ కుమార్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. రజత్ కుమార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి ఢిల్లీ హైకోర్టు లో తాజాగా కీలక విచారణ జరిగింది. ఆయనపై వచ్చిన ఫిర్యాదును 3 నెలల్లోగా తేల్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ల నిధులతో రజత్ కుమార్.. తన కుమార్తె పెళ్లి జరిపారని.. అది నిబంధనలకు విరుద్ధమని కోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే ఈ పిటిషన్ దాఖలై ఏళ్లు గడుస్తున్నా ఎలాంటి పురోగతి లేకపోవడంతో తాజాగా ఢిల్లీ హైకోర్టు స్పందించింది. గతంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఐఏఎస్ రజత్ కుమార్.. తన కుమార్తె వివాహాన్ని హైదరాబాద్‌లోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో 5 రోజుల పాటు చాలా గ్రాండ్‌గా జరిగిందని సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. అయితే ఈ పెళ్లి ఖర్చులను కొన్ని షెల్ కంపెనీల ద్వారా చెల్లించారని పిటిషనర్ ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై విచారణ జరుగుతోంది. అయితే తాను మొదట డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ)కి ఫిర్యాదు చేసినట్లు గవినోళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఆ ఫిర్యాదును తదుపరి చర్యల కోసం తెలంగాణ ప్రభుత్వానికి డీఓపీటీ పంపించింది. అయితే ఈ ఫిర్యాదుపై తెలంగాణ సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో.. సీబీఐ విచారణ కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించినట్లు గవినోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐఏఎస్ రజత్ కుమార్ కుమార్తె వివాహం ఫలక్‌నుమా ప్యాలెస్‌లో మేఘా కృష్ణా రెడ్డికి సంబంధించిన షెల్ కంపెనీల ద్వారా జరిగిందని ఆరోపణలపై విచారణ జరపాలని తాను డీఓపీటీని కోరినట్లు పిటిషనర్ గవినోళ్ల శ్రీనివాస్ తేల్చి చెప్పారు. ఈ పిటిషన్‌ను డీఓపీటీ.. తెలంగాణ ప్రభుత్వానికి పంపించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. అందుకే తాను ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే నిర్ణీత కాలపరిమితిలోగా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించినట్లు పిటిషనర్ వెల్లడించారు. ఈ ఫిర్యాదుపై తగిన నిర్ణయం తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఫిర్యాదు చేసి 4 ఏళ్లు గడుస్తున్నా.. ఆరోపణలపై ఎలాంటి విచారణ లేదా దర్యాప్తు జరగలేదని పిటిషనర్ తరపు లాయర్ ఢిల్లీ హైకోర్టుకు విన్నవించారు.

## ప్రధాని మోదీ ఒక 'ఉగ్రవాది'

### అభివర్ణించిన మల్లికార్జున ఖర్గే- ఆపై వివరణ

### 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం సమాఖ్య స్ఫూర్తికి దక్కిన విజయం

### తమిళనాడు ఎన్నికల ప్రచారంలో ఖర్గే కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)



ప్రధాని నరేంద్ర మోదీని ఉగ్రవాదిగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. అయితే దీనిపై వెంటనే స్పందించిన ఆయన, తాను ఆ ఉద్దేశంతో అనలేదని, ప్రధాని మోదీ ప్రజలను, రాజకీయ పార్టీలను భయభ్రాంతులకు (టెర్రరైజింగ్) గురిచేస్తున్నారనే అర్థంలో అన్నానని వివరణ ఇచ్చారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీతో ఏఐఏడీఎంకే పొత్తుపెట్టుకోవడాన్ని ప్రశ్నిస్తూ ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "అన్నాదురై ఫొటో పెట్టుకునే ఏఐఏడీఎంకే వారు మోదీతో ఎలా కలుస్తారు? ఆయన ఒక ఉగ్రవాది. ఆయన పార్టీకి సమానత్వం, న్యాయంపై నమ్మకం లేదు. అలాంటివారితో వీరు చేతులు కలపడం అంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే. అన్నాదురై, కామరాజ్, పెరియార్, కలైంజ్ఞర్ (కరుణానిధి), బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను నీరుగార్చడమే. కాంగ్రెస్-డీఎంకే కూటమి సంక్షేమం, సమగ్ర వృద్ధి, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలను అందిస్తూనే ఉంటుంది" అని అన్నారు.మహిళా రిజర్వేషన్ బిల్లును ఓడించడం ద్వారా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు భ్రూణహత్యకు పాల్పడ్డాయని ప్రధాని మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆరోపించిన నేపథ్యంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అయితే దీనిపై రాజకీయ దుమారం చెలరేగడంతో ఖర్గే వివరణ ఇచ్చారు. ఖర్గే వివరణ ఇచ్చినప్పటికీ బీజేపీ మాత్రం ఆయనపై విమర్శలు ఆపలేదు. పైగా కాంగ్రెస్ పార్టీని 'అర్బన్ నక్సల్ పార్టీ' అని విమర్శించింది. అంతేకాదు కాంగ్రెస్ పార్టీ రిమోట్ కంట్రోల్ దేశ వ్యతిరేక శక్తుల చేతుల్లో ఉందని ఆరోపించింది. కేంద్ర మంత్రి పీయూశ్ గోయెల్ సైతం ఖర్గే వ్యాఖ్యలను ఖండించారు. ప్రధాన మంత్రి మోదీని అవమానించినందుకు గాను కాంగ్రెస్ ఆయనకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**బీజేపీ ప్రమాదకరమైన ఆట ఆడుతోంది!**

మరోవైపు మహిళా రిజర్వేషన్లను నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ముడిపెట్టడం ద్వారా బీజేపీ ఒక ప్రమాదకరమైన ఆట ఆడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడాన్ని ఆయన స్వాగతించారు. మంగళవారం తమిళనాడులోని వేళచ్చేరిలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఖర్గే మాట్లాడుతూ, రాజ్యాంగ సవరణ బిల్లు-2026పై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించడానికి కేంద్రం నిరాకరించిందని ఆయన ఆరోపించారు.

**స్టాలిన్‌దే ఆ ఘనత!**

'ఈ బిల్లుకు వ్యతిరేకంగా మొదట గళమెత్తింది తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్. ఎందుకంటే ఇది ప్రజలకు, దక్షిణాది రాష్ట్రాలకు వ్యతిరేకమైనది అంటూ ఆయన బిల్లు ప్రతులను చింపి తగలబెట్టారు. చివరకి లోక్‌సభలో ఆ బిల్లు వీగిపోయింది.



## పవన్ కళ్యాణ్ ఆరోగ్యానికి ప్రత్యేక పూజలు

### గోపాల్ నగర్‌లో భక్తి వాతావరణం

కూకట్ పల్లి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని కోరుతూ కూకట్‌పల్లి గోపాల్ నగర్‌లో భక్తి భావం ఉట్టిపడింది. ఇటీవల జరిగిన శస్త్రచికిత్స అనంతరం ఆయన శీఘ్ర కోలిక కోసం పవన్ కళ్యాణ్ యూత్ ఫోర్స్ సభ్యులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం గోకుల్ ఫ్లాట్స్‌లోని శ్రీ అభయ వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, ఆకు పూజలు ఘనంగా జరిగాయి. ఈ పూజలకు ముఖ్య అతిథిగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కోఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గోత్ర నామంతో పూజలు నిర్వహించి, అనంతరం 108 టెంకాయలు కొట్టి ఆయన త్వరగా కోలుకోవాలని భక్తితో ప్రార్థనలు చేశారు. ఆలయం పరిసరాలు భక్తులతో కిక్కిరిసి, "పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి" అనే నినాదాలతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో గోపాల్ నగర్ పవన్ కళ్యాణ్ యూత్ ఫోర్స్ సభ్యులు, జనసేన నాయకులు, కాలనీ వాసులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రజా నాయకుడి ఆరోగ్యం కోసం అభిమానులు చేసిన ఈ భక్తి కార్యక్రమం స్థానికంగా విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## పక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారిని జిహెచ్ఎంసి అధికారులు తొలగించారు

### అర్ధాంతరంగా రోడ్డుమీద పడేసి వారి జీవనోపాధికి గండి కొట్టడం దారుణం.. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్ పల్లి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం కలిసి నియోజకవర్గంలోని ఇటీవల కొన్ని ప్రాంతాల్లో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటూ.. జీవనం సాగిస్తున్న నిరుపేదలను జిహెచ్ఎంసి వారు తొలగించడంతో వారు రోడ్డున పడ్డారు. ఈ విషయాన్ని కమిషనర్ కి తెలియజేస్తూ ఎంతో కాలంగా వారు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ పూలు పళ్ళు వంటివి అమ్ముకుంటూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అటువంటివారిని అర్ధాంతరంగా రోడ్డుమీద పడేసి వారి జీవనోపాధికి గండి కొట్టడం దారుణమని అన్నారు. మానవీయ కోణంలో ఆలోచించి తిరిగి వారికి వ్యాపారాలు చేసుకునేటట్టు అధికారులకు సూచనలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్, శ్యామల రాజు తదితరులు పాల్గొన్నారు.



## కేరళలో బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

తిరువనంతపురం, (ప్రభాత ఉదయం)

తమిళనాడు విరుదునగర్‌లోని బాణసంచాలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాద ఘటన మరువక ముందే.. కేరళలో మరో విషాదం నెలకొంది. త్రిస్సూర్‌లోని ఓ బాణసంచా ఉత్పత్తి కేంద్రంలో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందారు. మరో 40 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. త్రిస్సూర్ తిరువంబడిలోని ఓ బాణసంచా తయారీ యూనిట్లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 24న జరగాల్సిన నమూనా బాణసంచా కోసం ఆ కేంద్రంలో సామగ్రిని ఉత్పత్తి చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో ఆ శబ్దం సుమారు కొన్ని కిలోమీటర్ల మేర వినిపించినట్టు స్థానికులు తెలిపారు. తొలుత దీన్ని భూప్రకంపనలుగా భావించినట్టు వారు తెలిపారు. పేలుడు అనంతరం ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. అయితే.. నల్లటి పొగలు, మరోసారి పేలుడు సంభవించిన కారణంగా సహాయక చర్యలు కష్టతరంగా మారాయని అక్కడి అధికారులు వెల్లడించారు. ఆ యూనిట్లో పేలని బాణసంచా పదార్థాలు ఇంకా ఉన్నాయనే అనుమానంతో.. అత్యంత జాగ్రత్తగా సహాయక కార్యకలాపాలు సాగుతున్నాయి. పేలుడుకు గల కచ్చితమైన కారణాలేమిటో ఇంకా తెలియరాలేదు.

# ఉద్యమనేత మాజీ సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర ప్రగతి





**మైలార్ దేవుపల్లి డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్**

**కాంగ్రెస్ తో విసిగిన ప్రజలు.. కాంగ్రెస్ పాలనకు చమర గీతం పలకటం ఖాయం**

**కెసిఆర్ అధికారంలోకి రాగానే హైడ్రా ఇంటికే**

**కేసీఆర్ చిత్రానికి క్షీరాభిషేకంలో కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు**

**రాజేంద్రనగర్,ఏప్రిల్21(ప్రభాత ఉదయం):**

కేసీఆర్ పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని,ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసుగు చెందారని మాజీ కౌన్సిలర్,కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు.కాంగ్రెస్ పాలకులు హైడ్రా పేరుతో సామాన్య ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు.తిరిగి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకివస్తేనే హైడ్రాను ఇంటికి పంపవచ్చని ఆయన అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ లో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలతో కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్,ల ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...హైడ్రా అంటే పేదల ఇండ్లను కూల్చుడేనా..?రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని వ్యాఖ్యానించారు.వచ్చిన మొదటి రోజే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తాం..జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్..వెల్లడించిన శుభ సందర్భంగా రెండు డివిజన్ నాయకులు కార్యకర్తలు కోలహాలంగా కేసీఆర్ చిత్రపటానికి ఘనంగా క్షీరాభిషేకం చేశామన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం పరివాహక ప్రాంతంలో మూసి సుందరీకరణ డ్రామాతో పేదల ఇళ్లను హైడ్రా కూల్చివేతలపై నిరంతర పోరాటం సాగించిన రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తనదైన శైలిలో ప్రజా పక్షాన నిలిచిన తీరు యావత్ తెలంగాణ అబ్బురపరిచేలా ఉ ందన్నారు.వారి పోరాట పటిమకు పార్టీ రాష్ట్ర నాయకులు,వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మొదలుకొని సబితా ఇంద్రారెడ్డి,హరీష్ రావు అనేక దఫాలుగా పర్యటించి మూసీ పరివాహక ప్రాంతంలో పేదల ఇళ్లను కూల్చివేసే హైడ్రాను అడ్డుకున్న తీరు హర్షణీయమని కొనియాడారు.ఈ సందర్భంగా ఇదే విషయంపై నిన్న జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైడ్రాపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ,బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే మొదటి సంతకంతోనే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తామన్నారు.పేదల ఇండ్లు కూల్చుడేనా హైడ్రా పని..?మేము అధికారంలోకి ఉన్నప్పుడు 3.5 లక్షల పేదల కుటుంబాలకు పట్టాలు ఇచ్చామని,ఇప్పుడేమో కనీసం పిల్లల పుస్తకాలు కూడా తీసుకోనివ్వకుండా ఇండ్లు కూలుస్తున్నారని మండిపడ్డారు.భూములు కబ్జా చేయడానికి మూసీ నది దగ్గరున్న పేదల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని,హైడ్రా అంటే పేదల కొంపలను కూల్చుడేనా,రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..వచ్చిన మొదటి రోజే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తామన్నారు.మూసీ పేరుతో 15 వేల పేదల ఇండ్లు కూలగొడతారా..? ఇదంతా భూములు కబ్జా పెట్టి రియల్ ఎస్టేట్ దందా,దోపిడీ కోసమే అని కేసీఆర్ అన్నారని వెంకటేష్ తెలిపారు.కేసీఆర్ మాటలు యావత్ తెలంగాణ ప్రజానీకము సంతోషం వ్యక్తపరుస్తూ ఉందని కొనియాడుతూ రాబోయే రోజుల్లో హైడ్రా నుంచి విముక్తి కలుగుతుందని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ ముదిరాజ్,అక్కెం రాఘువేందర్ యాదవ్,రాజేష్ యాదవ్,సరిత మహేష్,తిరుపతి రెడ్డి,యాదయ్య,కొంపల్లి జగదీష్,వెంకటరమణ,మైసిరెడ్డి,ఆప్కో రాజు,బాలరాజు యాదవ్,సునీల్,రాజ్ కుమార్,అశోక్ కుమార్,ఈర్లపల్లి ప్రవీణ్,అనిల్,సింహాచలం,నరేష్ యాదవ్,మల్లేష్,సంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి,మహేందర్,నరేష్,చంద్రశేఖర్ రెడ్డి,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలి

**బీ ఆర్ ఎస్ నాయకులు**

**బుద్వేల్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**

వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకొని ముఖ్యమంత్రిగా కేసీఆర్ ను చేసుకుంటే ప్రజలకు అన్ని రకాల మేలు జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ మైలర్ దేవుపల్లి పల్లి , కాటేదాన్ డివిజన్ల అధ్యక్షులు ఎస్ వెంకటేష్ , గుమ్మడి కుమార్, సీనియర్ నాయకులు బండ రాజేష్ యాదవ్ లు అన్నారు. మంగళవారం మైలార్ దేవుపల్లి కాటేదాన్ హనుమాన్ దేవాలయం ఆవరణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి వారు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల అధ్యక్షులు ఎస్ వెంకటేష్, గుమ్మడి కుమార్ , బండ రాజేష్ యాదవ్ లు మాట్లాడుతూ, తెలంగాణ లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే హైడ్రాను తీసివేసి పేదల పక్షాన నిలబడుతుందని చెప్పడం సంతోష కరమన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం ఈ రాష్ట్రానికి అవసరమన్నారు. కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు డి రమేష్ ముదిరాజ్, కొంపల్లి జగదీష్, అక్కెమ్ రాఘవేందర్ యాదవ్, శీలం తిరుపతి రెడ్డి, ఏర్వ సరిత, మైసి రెడ్డి, నరేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మైలార్ దేవుపల్లి, కాటేదాన్ బి ఆర్ ఎస్ నాయకులు



## ప్రజలకు పాలన చేరువకోసమే ప్రజాపాలన: సర్కిల్ డీపీఓ స్వాతి

**రాజేంద్రనగర్ లో ఆసరా కార్డుల పంపిణీ**

**రాజేంద్రనగర్,ఏప్రిల్21(ప్రభాత ఉదయం)**

ప్రభుత్వం ప్రజలకు పథకాలను చేరువ చేసేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని సర్కిల్ డీపీఓ స్వాతి తెలిపారు.రాజేంద్రనగర్ సర్కిల్--19లో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆసరా కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్ల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మొత్తం 60మంది సీనియర్ సిటిజెన్లకు ఆసరా కార్డుల పంపిణీ చేశారు.కార్డులు అందుకున్న సీనియర్ సిటిజెన్లు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిఓ లక్ష్మణ్,ఆర్పీలు,సీనియర్ సిటిజెన్లు తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి సేవలో భాగస్వాములు కావాలి

**అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి**

**పర్యావరణ సమతుల్యతకు పక్షుల పాత్ర అమోఘమైంది..**

**పక్షుల దాహం తీర్చేందుకు నీటి తొట్టెల ఏర్పాటు అభినందనీయం**

**మూగజీవాల కోసం నీటి వసతి కల్పించాలి**

**రాజేంద్రనగర్,ఏప్రిల్21(ప్రభాత ఉదయం)**

కసురుతున్న మండే ఎండల్లో పక్షుల దాహం తీర్చడానికి పూనుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి అన్నారు.చింతకుంట పార్క్ వాకర్స్ పిట్టల నీటి తొట్టెల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు.భానుడి భగభగలకు ప్రకృతి విలవిల్లాడుతున్న వేళ,పక్షులు డీహైడ్రేషన్‌తో ప్రాణాలు కోల్పోకుండా వాకర్స్ ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.చింతకుంట పార్క్ ఆవరణల్లోని పచ్చని చెట్ల నీడన ప్రత్యేకంగా మట్టి పాత్రలను ఏర్పాటు చేసి,ఒక క్రమశిక్షణతో కూడిన సేవా యజ్ఞానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి మాట్లాడుతూ...మండే ఎండలకు సాధారణ మానవులే తట్టుకోలేక పోతున్నార న్నారు. మానవాళి మనుగడకు పర్యావరణ సమతుల్యత అవసరమన్నారు.పర్యావరణ సమతుల్యతకు పక్షుల పాత్ర అమోఘమైందని అన్నారు.మీ ఇంటి ముందో,బాల్కనీలోనో లేదా మిద్దె పైనో ఒక చిన్న పాత్రలో నీటిని ఉంచాలని,అది ఎండల తీవ్రతకు అల్లాడిపోయే పక్షులకు ప్రాణదానంతో సమానమని డిప్యూటీ కమిషనర్ సూచిస్తున్నారు. మన చుట్టూ ఉన్న జీవజాలాన్ని కాపాడుకోవడం కేవలం ప్రభుత్వానిదే కాదు,ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని వారు తెలిపారు.మానవత్వంతో ప్రతి ఒక్కరూ స్పందించి,తమ పరిసరాల్లో మూగజీవాల కోసం నీటి వసతి కల్పించాలని కోరారు.చింతకుంట పార్క్ వాకర్స్ నుంచి వచ్చిన ఈ పిలుపుతో సామాన్య ప్రజలు సైతం స్ఫూర్తి పొంది,తమ వంతుగా ప్రకృతి సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.చింతకుంట పార్కుతో సహా అన్ని పార్కులలో పరిశుభ్రత కోసం వారంలో ఒక రోజు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు వెల్లడించారు.పక్షుల దాహాన్ని తీర్చడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిన చింతకుంట పార్కు వాకర్సును ఆయన అభినందించారు.

## జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రాజేంద్రనగర్

# గిరిజన ఐ ఐ టీ స్టడీ సెంటర్ విద్యార్థుల ప్రతిభ



కె శివ ప్రసాద్



యోగిరాజ్ నాయక్



చౌహాన్ ప్రవీణ్



అజ్మీరా మహేష్



ఎస్ వెంకటేశ్వర్లు



భానోత్ కార్తీక్



రమావత్ లక్ష్మణ్ నాయక్

**బుద్వేల్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం) :**

2026 ఎన్ టి ఏ ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రాజేంద్రనగర్ గిరిజన ఐ ఐ టీ స్టడీ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 49 మంది విద్యార్థులను ఈ పరీక్షలకు సిద్ధం చేయగా అందులో 45 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ కి క్వాలిఫై కావడం జరిగింది. గ్రామీణ తండాల నేపథ్యం నుండి వచ్చిన ఈ పిల్లలు ఇంతటి ప్రతిభ కనబరచడం అసాధారణ విషయమని. వాళ్లంతా మట్టిలో మాణిక్య లాంటివారని .ఈ కళాశాల ఇంజనీర్లను డాక్టర్లను ఉత్పత్తి చేసే ఒక అద్భుతమైన కర్మాగారం వంటిదని కళాశాల ప్రిన్సిపాల్ పార్వతమ్మ తెలియజేయడం జరిగింది . ఇంతటి అద్భుత విజయానికి కారణం విద్యార్థులు కృషి పట్టుదల , అధ్యాపకుల ప్రతిభ నైపుణ్యాలు , ప్రభుత్వం ఉన్నతాధికారుల సహకారం, మా యొక్క కళాశాల ప్రధాన చార్యులు ఉప ప్రధానాచార్యుల యొక్క మార్గదర్శనంలో సిబ్బంది సహకారంతో ఇంతటి అద్భుత ఫలితాలను నమోదు చేయడం జరిగిందని తెలియజేశారు. జే ఈ మెయిన్స్ లో కె శివ ప్రసాద్ 99.15 పర్సంటైల్, పి యోగిరాజ్ 93. 33 పర్సంటైల్, ప్రవీణ్ 93. 01 పర్సంటైల్, అజ్మీరా మహేష్ 91.97 పర్సంటైల్, ఎస్ వెంకటేశ్వర్లు 90.81 పర్సంటైల్, బానోత్ కార్తీక్ 90.18 పర్సంటైల్, లక్ష్మణ్ నాయక్ ,90.01 పర్సంటైల్ లు సాధించారు



మే డే వాల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న ఏ ఐ టీ యూ సీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనం పల్లి జైపాల్ రెడ్డి

## అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డేను విజయవంతం చేయండి

**నాలుగు లేబర్ కోడులను రద్దు చేసేవరకు పోరాడుదాం**

**రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**

**బుద్వేల్ , ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం) :**

నాలుగు లేబర్ కోడులను రద్దు చేసే వరకు పోరాడాలనే పిలుపుతో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే ను నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి తెలిపారు కాటేదాన్ రామ్ చరణ్ ఆయిల్ మిల్ చౌరస్తా దగ్గర, మైలార్ దేవ్ పల్లి చౌరస్తాలో అంతర్జాతీయ మేడే దినోత్సవం గోడ పత్రికను మంగళవారం కార్మికులతో కలిసి విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడూలను రద్దు చేసే వరకు కార్మిక వర్గం పోరాటాలు నిర్వహించాలని కార్మిక వర్గానికి వనంపల్లి జైపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. కాటేదాన్,గగన్ పాడ్, తదితర ప్రాంతాలలో వేలాదిమంది కార్మికులు ఉన్నారని కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనాలు రూ .26 వేల రూపాయలు అన్ని రంగాల కార్మికులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆయన వాపోయారు కాంట్రాక్టర్లు కార్మికులపై పెత్తనం చేస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే ను నాలుగు లేబర్ కోడుల రద్దు చేసే వరకు పోరాట కేంద్రంగా కార్మిక వర్గం మేడేను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల ఏఐటీయూసీ అధ్యక్షులు ఈ సాయిలు, ఉపాధ్యక్షులు ఏ రాజు, మండల నాయకులు జాషువా, సురేష్, మనోజ్, శ్రీను, రమేష్, పరమేష్, కృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్నీ ప్రారంభిస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు వై. శ్రీధర్

## రాజేంద్రనగర్‌లో చలి వేంద్రం ప్రారంభం

**బుద్వేల్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం) :**

వేసవి కాలంలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు రాజేంద్రనగర్ ఎన్ ఐ ఆర్ డీ సర్కిల్ వద్ద గుడిసె యాదయ్య చలివేంద్రం (ఉచిత త్రాగు నీటి కేంద్రం) ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ గోషామహల్ అసెంబ్లీ ఇంచార్జ్ యతిపతి శ్రీధర్ హాజరై రిబ్బన్ కట్ చేసి చలివేంద్రం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వై . శ్రీధర్ మాట్లాడుతూ, ప్రజా సేవలో ఎప్పుడూ ముందుండే గుడిసె యాదయ్య వేసవి కాలంలో పాదచారుల కోసం త్రాగునీటి సౌకర్యం కల్పించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు గుంజ బాబు రావు , ఎస్సీ మోర్చా డివిజన్ ప్రధాన కార్యదర్శి ఇ.వేణు గోపాల్ ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు పి రవీందర్ (చిన్న) , డివిజన్ ఉపాధ్యక్షురాలు సరితా రెడ్డి నాయకులు సునిగంటి పెంటయ్య, బచ్చల రాజు, మంత్రి చంద్రశేఖర్, జ్ఞానేశ్వర్, జంగయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హోంశాఖ మాజీ మంత్రి స్వర్గీయ పి ఇంద్రారెడ్డి వర్ధంతి

**ఉదయం 10 గంటలకు పీడీపీ చౌరస్తాలో జరిగే వర్ధంతి సభలో పాల్గొననున్న.. ఆయన తనయుడు, బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి**

**బుద్వేల్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న హోంశాఖ మాజీ మంత్రి దివంగత పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతిని బుధవారం ఉదయం 10 గంటలకు పీడీపీ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రారెడ్డి తనయుడు, బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి, ఆ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. స్వర్గీయ ఇంద్రారెడ్డి రాజకీయ నాయకునిగా రంగారెడ్డి జిల్లాలో ప్రధాన పాత్ర పోషించి అనేకమంది నాయకులను తయారు చేసిన వారిలో ఒకరు. రంగారెడ్డి జిల్లాలో ప్రతి గ్రామంలో కార్యకర్తలు, నాయకులు ప్రజల పేర్లు పెట్టి పిలుస్తూ అందరి మంచి చెడుల్లో చురుకుగా పాల్గొనే నాయకులు గా ఇంద్రారెడ్డి కి పేరుంది. పీడీపీ చౌరస్తాలో జరుగనున్న ఇంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమం లో పార్టీ నాయకులు ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకులు కొలను సుభాష్ రెడ్డి తెలిపారు



స్వర్గీయ పి ఇంద్రారెడ్డి

## మద్యం మత్తులో రౌడీ షీటర్ హల్చల్

**బుద్వేల్, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం) :**

మైలార్ దేవపల్లి పరిధిలో రౌడీ షీటర్ హల్చల్ చేశాడు మద్యం మత్తులో ఉన్న రౌడీ షీటర్ అదే బస్తీ లో నివసిస్తున్న ఇద్దరు వ్యక్తులను డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. వారు డబ్బులు లేవని చెప్పడంతో ఆగ్రహానికి గురైన అతా హుల్లా ఖాన్ అనే రౌడీ షీటర్ తన వెంట తీసుకువచ్చిన కత్తితో మహమ్మద్ ఫరీఫ్ , మహమ్మద్ ఇస్మాయిల్ లపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి కి తీవ్ర గాయాలైనాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న మైలార్ దేవపల్లి పోలీసులు పరారీలో ఉన్న రౌడీ షీటర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు



గాయపడ్డ యువకులు

# నకిలీ కూలర్లతో వినియోగదారుల జేబులకు చిల్లు!

**కన్నె (ఎర్ర) సూర్యుడు!!**

**ప్రభుత్వానికి ఆదాయపు పన్ను ఎగవేత!!**

**ఆదాయపు పన్ను!! సేల్స్ టాక్స్ అధికారుల వైఫల్యం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం)**



భానుడు భగ్గు మంటున్నాడు. ఉదయం తొమ్మిదింటి నుంచే సూరీడు సుర్రుమంటున్నాడు. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రహదారులు జన సంచారం లేక బోసిపోతున్నాయి. సాయంత్రం వరకు ఎండ వేడిమి తగ్గడం లేదు. గత వారం రోజులుగా జిల్లాలో భానుడి ప్రతాపానికి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండల తీవ్రతకు తోడు ఉక్కపోత, వడగాలులతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. బయట అడుగు పెట్టాలంటేనే జంకుతున్నారు. అంతే కాకుండా ఉష్ణోగ్రతకు వన్యప్రాణులు అల్లాడి పోతున్నాయి. మూడు రోజులు గా జిల్లాలో 40 నుంచి 41.5 డిగ్రీల సెల్సియస్‌తో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డీ హైడ్రేషన్‌కు లోను కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మరో కొన్ని రోజులు ఇలాగే ఉంటుందని అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**అన్ బ్రాండెడ్ కూలర్లు..**

వేసవి తాపం నుండి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూలర్ల కొనుగోలుపై ఆసక్తి చూపుతుండటాన్ని ఆసరాగా చేసుకుని, కొందరు వ్యాపారులు నకిలీ కూలర్లను మార్కెట్లోకి వదులుతున్నారు. ప్రముఖ బ్రాండ్ల పేర్లను పోలి ఉండేలా స్టిక్కర్లు అంటించి, నాసిరకం మోటార్లు మరియు బాడీలతో వీటిని విక్రయిస్తున్నారు. గద్వాల కేంద్రంలో ఎక్కడ లేని విధంగా కూలర్ల ధరలను వ్యాపారులు దారుణంగా మోసం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. నాణ్యతలేని కూలర్లు డూప్లికేట్ కంపెనీ పేరుతో ఒరిజినల్ కంపెనీ కూలర్ గా నమ్మించి మోసం చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలిసినా కూడా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు ముఖ్యంగా ఎలాంటి వే బిల్లు లేకుండా ప్రభుత్వానికి చెల్లించవలసినటువంటి ఆదాయపు పన్ను ఇన్కమ్ టాక్స్ చెల్లించకుండా వ్యాపారస్తులు ప్రతిరోజు లక్షల రూపాయల డబ్బులు సంపాదిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నప్పటికీ సంబంధించిన సంబంధిత అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నలు వస్తున్నాయి. బాధ్యతగల అధికారులు పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేయకుండా ఏసీ రూముల్లో ఏసీ కారులో తిరుగుతూ లగ్జరీ జీవితం గడుపుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల చెమట చుక్కలను నీటి చుక్కలుగా పరిగణిస్తున్నారని పేద ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వైఫల్యం వల్లనే తాగునీటి వాటర్ బాటిల్ తో సహా ప్రతి విషయంలో మోసం చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాడీ రోడ్లపై ప్రజలను నిర్ధాక్షంగా మోసం చేసినా కూడా సంబంధించిన అధికారులు చూడకుండా వెళ్ళిపోతున్నారని ప్రజలు బాధపడుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలలో ఎక్కడ చూసినా వేసవికాలంలో నకిలీ కూలర్ల విక్రయాలు దర్జాగా అమ్ముతూ దోపిడీ చేస్తున్నారని ప్రజల ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు డూప్లికేట్ కూలర్ల విక్రయాలను అరికట్టాలని బిల్లు లేకుండా ఇష్టారాజంగా కూలర్లను విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.



## అంతర్జాతీయ మదర్‌ఎర్త్ డే గోడపత్రికలు విడుదల

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈనెల 22న అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పురస్కరించుకుని ఉదయం 8.00 గంటల నుంచి 8.30 గంటల మధ్య విద్యార్థులు, యువతకు గద్వాల ప్రాక్టీసింగ్ హై స్కూల్ నుంచి సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు తెలిపారు. సైకిల్ ర్యాలీకి సంబంధించిన గోడ పత్రికలను మంగళవారం తన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాలీ ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, కాలుష్య నియంత్రణలో భాగంగా సైక్లింగ్ వంటి పర్యావరణ హిత మార్గాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అంతకుముందు గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల వద్ద జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి ఉపాధ్యాయులతో కలిసి గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీసి జిల్లా సమన్వయకర్త శ్రీధర్, ఋషి రాజు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఉత్సవ కమిటీ నాయకులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ సురభి గారిని ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంధం నాగరాజు గంధం రమేష్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గద్వాల పట్టణంలోని బీసీ బాలికల సమీకృత వసతి గృహంలో పరిశీలన అనంతరం వచ్చిన జిల్లా కలెక్టర్ ను వారు కలిశారు అలాగే జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత ను కలిసి ప్రభుత్వం చేపట్టిన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా వసతి గృహాల సందర్శన విద్యార్థులకు అవగాహన గురించి మాట్లాడారు.





## బసవేశ్వరుని మార్గం అనుసరణీయం

**డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం)**

గద్వాలలోని ప్రభుత్వ పీజీ సెంటర్ లో విశ్వ గురువు మహాత్మా బసవేశ్వరుని 893 వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి విద్యార్థులను మాట్లాడుతూ దాదాపు 1000 సంవత్సరాల క్రితమే సమసమాజ స్థాపనకు, కుల నిర్మూలనకు, స్త్రీల హక్కులకై పాటుపడిన మహనీయుడు బసవేశ్వరుడని కొనియాడారు. నాటి సమాజంలో ఉన్న అనేక దురాచారాలను రూపుమాపడానికి కృషిచేసిన మహనీయుడని అన్నారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనలోని కొన్ని అంశాలు బసవేశ్వరుని తాత్విక బోధనలేనని కొనియాడారు. వారు చూపించిన మార్గం అందరికీ అనుసరణీయమని అన్నారు. పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తూ విశ్వగురువు బోధించిన 'శ్రమయే సౌందర్యం' వంటి బోధనలు నేటి సమాజానికి అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డా. గోపినాథ్ రాథోడ్, డా. కే. మహేందర్, డా. రవి షరీన్, ఎండి రఫీ, రంగారెడ్డి, నవీన్ గౌడ్, నరేష్ రెడ్డి, లక్ష్మయ్య, నమ్రత, శ్వేత, బోధ నేతల సిబ్బంది అన్వేష్ మరియు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ప్రజాపాలనలో భాగంగా ఆసరా పెన్షన్ల పంపిణీ

**రాజేంద్రనగర్,ఏప్రిల్21(ప్రభాత ఉదయం)**

ఆసరా పెన్షన్ లను ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో అందించడం సంతోషంగా ఉందని అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి అన్నారు.అందులో భాగంగా అత్తాపూర్ వార్డు కార్యాలయంలో సీనియర్ సిటిజన్ కార్డ్స్ డిస్ట్రిబ్యూషన్ ను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 20మంది సీనియర్ సిటీజన్ లకు ఆసరా కార్డ్స్ అత్తాపూర్ డీసీ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డీపీఓ,సీఓ అండ్ వీఆర్‌పీ,ఆర్పిలు పాల్గొన్నారు.






## ఘనంగా వనపర్తి జిల్లా పరిషత్ మల్టీపర్పస్ హై స్కూల్ 1969-1970 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం

**వనపర్తి రాజప్రసాదం పాలిటెక్నిక్ కళాశాల భవనానికి నిధులు కేటాయించాలని సీఎంను కలవాలని నిర్ణయం**

**హైదరాబాద్, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం)**

వనపర్తి పట్టణ కేంద్రంలోనిజిల్లా పరిషత్ మల్టీపర్పస్ హైస్కూల్ 1969 - 1970 12వ క్లాసు లాస్ట్ బ్యాచ్ ఐదవ ఆత్మీయ సమ్మేళనం మంగళవారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరుపుకున్నారు. ఈ బ్యాచ్ పూర్వ విద్యార్థులు 2011లో మొదటగా వనపర్తి లో జరుపుకున్నాం మిగతావి వనపర్తి లో జరుపుకోగా వివిధ రంగాలో నిష్ణాతులైన వ్యక్తులు కలిగి ఉన్న ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థులు మరోసారి కలుసుకొని ఆత్మీయతగా ఉభయ కుశలములు తెలుసుకున్నారు. మూడు సంవత్సరాల తర్వాత మన బ్యాచ్ షష్టిపూర్తి జరుపుకోవాలని అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మళ్లీ ఈ మధ్యనే ఒక సమ్మేళనం వనపర్తి లో జరుపుకొని సామాజిక సేవ గురించి కూడ పాలు పంచుకోవాలని దిశా నిర్దేశాలపై కోవాలని చర్చించుకున్నారు. వనపర్తి రాజప్రసాదము (పాలిటెక్నిక్) 1895 పార్సి టెక్నాలజీతో పూర్తయిన రాజా బంగ్లా 1959లో మొదటి భారత ప్రధాని పండిత్ జవహర్లాల్ నెహ్రూ చే పాలిటెక్నిక్ (సాంకేతిక కళాశాల) అప్పటి పార్లమెంటు సభ్యుడు జె రాజా రామేశ్వర రావు వారి రాజప్రసాదాన్ని ప్రభుత్వానికి ధారా దత్తము చేస్తూ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. అలాంటి రాజప్రసాదం ఈనాడు కళాహీ నమైందని 100 కోట్లకు పైగా వెచ్చించి రాజప్రసాదాన్ని మంచి టెక్నాలజీ ద్వారా పూర్వ వైభవం తేవాలని వనపర్తిలో విద్యాభ్యాసం చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి వినతిపత్రం ఇవ్వాలనితీర్మానించుకున్నారు.



## రోడ్డుపైన విరిగిపడ్డ చెట్టు కొమ్మలను వెంటనే తొలగించాలి

**మున్సిపల్ అధికారులను కోరిన రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురందరెడ్డి**

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**

ఇటీవల ఈదురుగాలతో కూడిన భారీ వర్షానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వీధిలో భారీగా చెట్లు విరిగిపడ్డాయని వెంటనే వాటిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చొరవ తీసుకోవాలని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి అన్నారు. అనంతరం జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో ఇటీవల కురిసిన గాలి, వాన, వర్షానికి చెట్టుకొమ్మలు విరిగి రోడ్డు అడ్డంగా పడిపోయాయని, వాహనదారులు వెళ్లి రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కమిటీ సభ్యులు వి శ్రీనివాసరావు వాటిని తొలగించి పక్కకు కుప్పలుగా వెయడం జరిగిందని అన్నారు. కావున మున్సిపల్ అధికారులు సిబ్బంది త్వరలోనే చెట్టుకొమ్మలు తొలగించవలసిందిగా కమిటీ సభ్యులు, కాలనీవాసులు అధ్యక్షులు జె పురేందర్ రెడ్డి కోరారు.



## క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందింప చేస్తుంది

**టిపిసిసి ఉపాధ్యక్షుడు,**


**కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**


**కూకట్ పల్లి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**

క్రీడలు శారీరక మానసిక వికాసానికి వ్యక్తుల మధ్య రాష్ట్రాలు దేశాల మధ్య కూడా అవినాభావ సంబంధాలు నెలకొల్పడానికి దోహదపడతాయని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఇటీవల సనత్ నగర్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మూసాపేట హనుమాన్ వ్యాయామశాల తరఫున పాల్గొన్న పాతపల్లి శివశంకర్ 59 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం కూకట్ పల్లి లో గల శ్రీ హేమ దుర్గా భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రమేష్ నీ మర్యాదపూర్వకంగా కలవగా శాలువాతో శంకర్ ను సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని మరిన్ని మెడల్స్ సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, శ్రీనివాస్, రామారావు, అక్బర్, నరేందర్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# గద్వాల జిల్లాలో ఉరుములతో కూడిన వర్షం


పట్టణ కేంద్రంలో కురిసిన వర్షానికి నిలిచిన వర్షపు నీరు


గాలికి కూలిన కటౌట్లు


వర్షానికి తడిసిపోయిన ధాన్యం

## తడిసి ముద్దైన ధాన్యం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**

గద్వాల జిల్లాలో ఎండల తీవ్రత 39 -41 డిగ్రీలకు చేరిన తరుణంలో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షాలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మంగళవారం సాయంత్రం జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. మల్దకల్, వడ్డేపల్లి,రాజోలి తదితర మండలాలో ఉరుములు మెరుపులతో పాటు వడగళ్ల వర్షం కురిసింది. ఎండలు ఒకవైపు వేధిస్తుండగా, మరోవైపు ద్రోణి , క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో రాష్ట్రంలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో గద్వాల జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి ఈదురుగాలుల మొదలై... ... ఆ తర్వాత ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురియడంతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. మరో వైపు అకాల వర్షాలకు మొక్క జొన్న, వరి పంటలకు అపార నష్టం వాటిలే అవకాశం ఉండటంతో... రైతులలో ఆందోళన మొదలైంది.జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సాయంత్రం వీచిన ఈదురుగాలులకు గద్వాల పాతబస్టాండ్ లో కటౌట్ ఫ్లెక్సీ నేలమట్టమైంది. రాత్రి 7గంటల నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరి అయిన పట్టణ ప్రజలు రాత్రి కురిసిన వర్షానికి వాతావరణం చల్ల బడటంతో పట్టణ ప్రజలు ఉపసమనం పొందారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### కొడకండ్ల ఏఎంసి చైర్ పర్సన్ నల్ల అండాలు శ్రీరామ్

### నల్లకుంట తండ లో ఐకేపీ సెంటర్ ను ప్రారంభించిన కొడకండ్ల ఏఎంసి చైర్ పర్సన్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం):**

జిల్లా లోని దేవరుప్పుల మండలం, నల్లకుంట తండా గ్రామంలో మంగళవారం పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ల ఆదేశాల మేరకు మంగళవారం కొడకండ్ల ఏఎంసి చైర్ పర్సన్ నల్ల అండాలు శ్రీరామ్ (ఐకేపీ) వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్ పర్సన్ నల్ల అండాలు శ్రీరామ్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యంమన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే వడ్లను అమ్ముకోవాలని సూచించారు. రైతులకు న్యాయమైన ధర అందేలా ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట గ్రామ సర్పంచ్ బానోత్ మహేందర్, ఉపసర్పంచ్ బానోత్ భాస్కర్, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఐకేపీ సెంటర్ ను ప్రారంభిస్తున్న నల్ల అండాలు శ్రీరామ్



# ఉన్నత చదువులతో గొప్ప స్థాయికి చేరుకోవాలి

### సామాజిక రుగ్మతల నివారణకు విద్యార్థులు కృషి చేయాలి

### సంక్షేమ వారోత్సవాల్లో ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ సురభి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం)**

చదువుతోనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, విద్యార్థులు చక్కగా చదువుకొని తాము అనుకున్న రంగాల్లో రాణించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ సురభి పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల రెండో రోజు మంగళవారం గద్వాల జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో సంక్షేమ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తోందన్నారు. విద్యార్థి దశలో చక్కగా చదువుకొని మంచి ఫలితాలు సాధిస్తే వారి భావి జీవితమంతా సంతోషంగా ఉంటుందన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. నృత్య, నాటక ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను అభినందించారు. బాల్యవివాహాలు వంటి సామాజిక రుగ్మతలను నివారించేందుకు విద్యార్థులు తమ వంతుగా కృషి చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో ఉండే సమస్యల పరిష్కారానికి ఈ వారోత్సవాల సందర్భంగా చేపట్టబోయే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు చేయాలన్నారు. వసతి గృహ విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు, వసతి గృహ వార్డెన్ లు వారం పాటు నిర్వహించే సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ



సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు అధికారులతో కలిసి కలెక్టర్ బహుమతులను అందజేశారు. అంతకుముందు పలువురు విద్యార్థులు చేసిన నృత్య, నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్, ఇతర అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వంటగదిని, స్టోర్ రూమ్, తదితర పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, ప్రత్యేక అధికారి నూకరాజు, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, స్థానిక కౌన్సిలర్ వేదవతి, మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ నాగరాజు, ఇతర అధికారులు, వార్డెన్లు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

### జనగామ జిల్లా డీసీవో పి.శ్రీనివాసరావు

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం):**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని కళాశాలల్లో (సీవోఈలు, నాన్ సీవోఈలు) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని జనగామ జిల్లా డీసీఓ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు https://tgswreis.telangana.gov.in వెబ్సైట్ ద్వారా ఈనెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష మే 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రవేశం పొందిన వారికి ప్రభుత్వం ఉచిత విద్య, వసతి సదుపాయం కల్పిస్తుందని తెలిపారు.



# జగద్గిరిగుట్టలో కబ్జాదారులపై హైడ్రా కొరడా

### పార్కింగ్ మాఫియా చెర నుంచి కోనేరుకు విముక్తి

### హర్షం వ్యక్తం చేసిన పూజారి నరహరి, స్థానిక భక్తులు

**కూకట్ పల్లి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం)**

అనేక దేవాలయాలకు నిలయమైన జగద్గిరిగుట్టలోని చారిత్రక కోనేరుకు (గుండం) ఎట్టకేలకు కొత్త కళ సంతరించుకుంది. కోనేరు ఆక్రమణలకు గురవుతోందని, దానిని కాపాడాలంటూ అక్కడి గోవిందరాజుల స్వామి ఆలయ పూజారి నరహరి కన్నీరుమున్నీరుగా విలపిస్తూ వేడుకున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఆ వీడియోపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి కోనేరు పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు కోనేరులోని ఆక్రమణలతో పాటు పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగించారు. దాదాపు 26 ట్రక్కుల నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని అక్కడి నుంచి తరలించి కోనేరుకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చారు. సుమారు ఎకరం విస్తీర్ణంలో ఉన్న ఈ కోనేరును కొందరు మట్టితో నింపి పార్కింగ్ కోసం వినియోగించుకుంటున్న క్రమంలో, కబ్జాదారుల ఆక్రమణలకు హైడ్రా చెక్ పెట్టి పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి నరహరి మాట్లాడుతూ తన 22 ఏళ్ల పోరాటం ఫలించిందని ఆనందం వ్యక్తం చేశారు. కోనేరును చూడకుండానే తన జీవితం అంతమవుతుందేమోనని ఆందోళన చెందానని, కానీ ఇప్పుడు హైడ్రా రూపంలో సాక్షాత్తూ ఆ భగవంతుడే వచ్చి కోనేరును పరిరక్షించాడని కొనియాడారు. శ్రీ వెంకటేశ్వర స్వామి, హనుమాన్, జగద్గిరిగుట్ట గోవిందరాజుల స్వామి, పోచమ్మ, శ్రీ వాసవి కనకపరమేశ్వరి, శ్రీ నల్ల పోచమ్మ, శివాలయం, పరశురామాలయం, అయ్యప్పస్వామి వంటి అనేక దేవాలయాలు కొలువైన జగద్గిరిగుట్ట నగర ప్రజలందరికీ సుపరిచితమేనని, ఇలాంటి చారిత్రక నేపథ్యం ఉన్న ఆలయ భూములను, కోనేరును కాపాడటం ఎంతో శుభపరిణామం అని అన్నారు. వర్షాలు పడినప్పుడు గుట్టపై నుంచి వచ్చే నీరు ఈ కోనేరులో చేరుతుందని, అవసరమైతే బోర్లు వేసి అయినా నీటితో కోనేరును నింపుతామని ఆయన స్పష్టం చేశారు. కబ్జాలను తొలగించి ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి, హైడ్రా అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


సన్మానం చేస్తున్న గౌరవ అధ్యక్షుడు రాజన్న

# మున్సిపల్ ఔట్సోర్సింగ్ డ్రైవర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నిక

### నూతన డ్రైవర్స్ అసోసియేషన్ కు మల్లిగారి రాజన్న సన్మానం

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం):**

జనగామ మున్సిపల్ ఔట్సోర్సింగ్ డ్రైవర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని యూనియన్ గౌరవాధ్యక్షులు మల్లిగారి రాజన్న ఆధ్వర్యంలో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులుగా మునిగే రవి, కార్యదర్శిగా మసి రాజు, కోశాధికారిగా బూసపాక ప్రేమ్ లను మంగళవారం ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పడిన డ్రైవర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులందరికీ యూనియన్ గౌరవాధ్యక్షులు మల్లిగారి రాజన్న శాలువలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈయొక్క కార్యక్రమంలో డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారిని ఆశీర్వదించిన మాజీ సిడిసి చైర్మన్ ఎం చంద్రశేఖర్ రెడ్డి

**కొత్తకోట, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం)**

మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మూలమల్ల శాంతమ్మ మూడవ కుమార్తె పల్లవి, నరేష్ దంపతుల కూతురు డోలోహరణ కార్యక్రమంలో పాల్గొని సి డి సి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి చిన్నారిని ఆశీర్వదించారు. చిన్నారిని ఆశీర్వదించిన వారిలో కుటుంబ సభ్యులు మూలమల్ల బాల్ రెడ్డి, ములమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, మూలమల్ల లోకా రెడ్డి, మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దాసరి విజయ్ కుమార్ రెడ్డి, దాసరి మైపాల్ రెడ్డి, మూలమల్ల జయపాల్ రెడ్డి ,షాద్ నగర్ ప్రశాంత్ రెడ్డి, అడ్డాకుల రాజేందర్ రెడ్డి, పామాపురం రామ్ రెడ్డి, శరత్ కుమార్ రెడ్డి లతోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# నేటి అర్ధరాత్రి నుండి ఆర్టీసీ బస్సులు బంద్

### ఆర్టీసీ జేఏసీ నాయకులతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ జరిపిన చర్చలు విఫలం .. ఈ అర్ధరాత్రి నుండి బస్సులు బంద్

**హైదరాబాద్, ఏప్రిల్ 21(ప్రభాత ఉదయం)**

డిపోలకే పరిమితం కానున్న ఆర్టీసీ బస్సులు ,ప్రజా రవాణా స్తంభించే అవకాశం సమ్మె నోటీసులు ఇచ్చి 41 రోజులు అవుతుంది 41 రోజుల తర్వాత ప్రభుత్వం చర్చలకు పిలిచింది ప్రభుత్వానికి మా సమస్యలను వివరించాం మా డిమాండ్లు అన్ని పాత డిమాండ్లే ఐఏఎస్ అధికారుల కమిటీ వేసి చర్చలు అనడం కరెక్ట్ కాదు.ఆర్టీసీ విలీనం, సంఘాల ఎన్నికలు, బస్సులు ఆర్టీసీనే నడపడం మా డిమాండ్.కార్మిక జేఏసీ మా డిమాండ్లను పూర్తిగా పరిగణలోకి తీసుకోలేదు. చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేసింది.అర్ధరాత్రి నుంచి సమ్మె కొనసాగుతుంది.ఎవరి ఒత్తిళ్లకు మేము తలొగ్గం - తెలంగాణ ఆర్టీసీ జేఏసీ నాయకులు.



# కవి పెట్లోజు వెంకటాచారి స్మారక పురస్కారం రవీంద్ర భారతిలో దరువు అంజన్న కి ప్రదానం

### ఐక్యవేదిక ఏడవ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ను తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేత

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం):**


మంత్రి జూపల్లి కి ప్రత్యేక సంచికను అందిస్తున్న కవులు

కవులు కళాకారుల ఐక్యవేదిక జనగామ జిల్లా ఏడవ వార్షికోత్సవం సందర్భంగా కవి హృదయం సాహిత్య వేదిక అందిస్తున్న దివంగత సామాజిక కవి ఆదర్శ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు పెట్లోజు వెంకటాచారి స్మారక పురస్కారం ను హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రధాన వేదికలో సోమవారం రాత్రి జరిగిన 25 వసంతాల దరువు జాతరలో ఓయూ ఉద్యమ నేత, ప్రజావాగ్గేకారులు, కవి, గాయకులు దరువు అంజన్నకు ప్రధానం చేశారు. ఈ అవార్డు విమలక్క, నల్గొండ గద్దర్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా కవి హృదయం సాహిత్య వేదిక అధ్యక్షులు పెట్లోజు సోమేశ్వరాచారి, కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షులు జి. కృష్ణ, ప్రముఖ వ్యాఖ్యాత, కవి డాక్టర్ వేముల సదానందం, జనగామ యువ సంగీత దర్శకుడు చిలుమోజు సాయికిరణ్, రాగ సుధా, జానపద సాంస్కృతి కళా సంస్థ అధ్యక్షులు గజవెల్లి ప్రతాప్అందించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ టూరిజం, సంస్కృతి, ఆర్కియాలజీ,మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు కి ఐక్యవేదిక ఏడవ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను అందించారు. జనగామకు దక్కిన గొప్ప గౌరవంగా శ్రీ శ్రీ కళా వేదిక జనగామ జిల్లాశాఖ అధ్యక్షులు లగిశెట్టి ప్రభాకర్, అభినందన సోషల్ సర్వీస్ అధ్యక్షులు అయిలా సోమనరసింహచారి, కవులు అంకాల సోమయ్య, పొట్టబత్తిని భాస్కర్, రంగరాజు ప్రసాద్, గడ్డం మనోజ్ కుమార్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, యాదయ్య పలువురు అభిప్రాయపడ్డారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608